సీసీఐ జాడేదీ?

- నేటి వరకూ ఊసే లేని సీసీఐ కేంద్రాలు
- దోచుకుంటున్న మిల్లర్లు, వ్యాపారులు
- అయోమయంలో పత్తి రైతులు
- చోద్యం చూస్తున్న అధికారులు
- రోజురోజుకు దిగజారుతున్న పత్తి ధర


ఆదోని మార్కెట్ యార్డుకు వచ్చిన పత్తి దిగుబడి

దేవనకొండ: రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు, దళారుల నుంచి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు చేపట్టాలని నిర్ణయించింది. ఏటా ఖరీఫ్‌లో పత్తి పంట సాగు చేసిన రైతులు వ్యవసాయ అధికారుల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. వారి దిగుబడిని మార్కెట్ యార్డుల్లో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల్లో పత్తిని కొనుగోలు చేసేది. అయితే నాలుగేళ్లుగా సీసీఐ ఆధ్వర్యంలో కేజీ పత్తి కూడా కొనుగోలు చేయకపోవడంతో రైతులు వ్యాపారుల చేతిలో నష్టపోతున్నారు. ఇష్టానుసారంగా ధర నిర్ణయిస్తుండటంతో గిట్టుబాటు ధర లభించడం లేదు. నాలుగేళ్ల క్రితం ఆదోని మార్కెట్ యార్డులో కేవలం 1800 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసింది. కొందరు మిల్లర్లు రైతులకు రుణాలిచ్చి వారి నుంచి దిగుబడులను తక్కువ ధరకు తీసుకొని మోసం చేస్తున్నారు.

ముగిసిన ఖరీఫ్..

ఖరీఫ్ ముగిసి రబీ ప్రారంభమైనా.. నేటికీ పత్తా లేని సీసీఐ కేంద్రాలు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రైతు పండించే పత్తి పంటకు కనీస మద్దతు ధర కల్పిస్తామన్న మాటలు కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితం చేసింది. ఆలూరు నియోజకవర్గంలో దాదాపు 53 వేల హెక్టార్లలో పత్తి పంట సాగైంది. దేవనకొండ మండలంలో 19 వేల హెక్టార్లు, ఆలూరు మండలంలో 11,200 హెక్టార్లు, ఆస్పరి 18 వేల హెక్టార్లు, చిప్పగిరి 500 హెక్టార్లు, హొళగుంద మండలంలో 2 వేల హెక్టార్లు, హాలహర్వి మండలంలో 2,500 హెక్టార్లలో పత్తి పంటను రైతులు సాగుచేశారు.

అచ్చెన్నాయుడి మాటలు గాలిమాటలేనా..

దాదాపు రెండు నెలల క్రితం వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. రైతు పండించిన పత్తిని సీసీఐ కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధర రూ.7,521తో కొంటామని ప్రకటించారు. అయితే నేటి వరకు ఒక్క కేజీ కూడా కొనలేదు కదా.. చివరకు సీసీఐ కేంద్రాలు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి. పత్తిని సీసీఐ కొనుగోలు చేయాలంటే మొదట రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. నెలరోజుల నుంచి రోజూ రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయ అధికారుల చుట్టూ రైతులు తిరుగుతున్నా..రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలుకావడం లేదు. రైతులు తిరిగి తిరిగి విసుగుచెంది అతి తక్కువ ధరకే బయటి వ్యాపారులకు అమ్మేస్తున్నారు.

పడిపోయిన పత్తి ధర..

నెల రోజుల క్రితం మార్కెట్‌లో పత్తి ధర రూ.8,200 నుంచి రూ.8,600 మధ్య ఉండేది. 20 రోజుల నుంచి పత్తి ధర అమాంతంగా తగ్గింది. ప్రస్తుతం రూ.7,500 నుంచి రూ.7600 మధ్య ధర పలుకుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వ్యాపారులకే మద్దతు

మెరుగైన ధర కల్పించేందుకు మార్కెట్‌లోకి వస్తున్నట్లు సీసీఐ చెప్పినా అమలుకు నోచుకోలేదు. పోటీ ధరతో మార్కెట్‌లోకి వస్తే వ్యాపారుల మధ్య పోటీ పెరిగి రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. ప్రస్తుతం రైతులు మార్కెట్ యార్డుకు విక్రయించడానికి తీసుకెళ్తున్నా.. అధిక శాతం పత్తి బహిరంగ మార్కెట్‌కు తరలుతోంది. కొందరు నేరుగా మిల్లులకు తరలించి తక్కువ ధరను విక్రయిస్తున్నారు. మార్కెట్ యార్డులో దళాలి, కమీషన్ పేరుతో వసూలు చేస్తుండటంతో పాటు నగదు ఇవ్వడం ఆలస్యమవుతుంది. అదే మిల్లర్లకు తక్కువ ధర అయినా వెంటనే సొమ్ము ఇస్తుండటంతో వారికి దిగుబడిని అప్పగించేందుకు మొగ్గు చూపుతున్నారు.

సీసీఐ ముఖ్య ఉద్దేశం..

రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర లభించని పక్షంలో ప్రభుత్వమే రైతు పండించిన పంటలను కొని వారికి మద్దతు ధర లభించేలా చేయడం. పత్తికి సీసీఐ మద్దతు ధర పొడవు గింజ రకం రూ.7,521, పొట్టి గింజ రకం రూ.7,121 ప్రకారం కొనుగోలు చేయాల్సి ఉంది.

త్వరలోనే సీసీఐ ద్వారా కొనుగోళ్లు ప్రారంభిస్తాం



త్వరలోనే మండలంలో సీసీఐ ద్వారా కొనుగోళ్లు ప్రారంభిస్తాం. ఇందుకు సంబంధించి జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడతాం. సీసీఐ ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందిన వెంటనే కొనుగోళ్లు మొదలవుతాయి.

– సురేష్‌బాబు, మండల వ్యవసాయాధికారి

బయటి మార్కెట్‌లో ధర తక్కువగా ఉంది



ఈ ఏడాది ఖరీఫ్‌లో నాలుగు ఎకరాల్లో పత్తి పంట సాగుచేశా. దిగుబడిని బయట మిల్లర్ల వద్దకు అమ్మడానికి వెళ్తే రూ.6,500 నుంచి రూ.7 వేల వరకు తీసుకుంటున్నారు. ఎందుకలా అని ప్రశ్నిస్తే.. మార్కెట్ యార్డులో వ్యాపారుల్లా దళాలీ, కమీషన్, వడ్డీ తీసుకోకుండా వెంటనే నగదు ఇస్తామని చెబుతున్నారు. మాకు ఆ ధర గిట్టుబాటు కాదు. సీసీఐ ద్వారా కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– నరసన్న, వెలమకూరు రైతు

దిగుబడి అంతంత మాత్రంగానే వచ్చింది



ఎనిమిది ఎకరాల్లో పత్తి పంట సాగుచేశా. పంట ఎదిగే సమయంలో వర్షాలు ఆలస్యం కావడంతో దిగుబడి అంతంత మాత్రంగానే వచ్చింది. మార్కెట్‌లో, మిల్లర్ల వద్ద గిట్టుబాటు ధర లభించడం లేదు. సీసీఐ ద్వారా గిట్టుబాటు ధర కల్పించేలా చూడాలి. అరకొర దిగుబడికైనా గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలి.

– వీరభద్రుడి, కూకటికొండ రైతు

క్లుప్తంగా

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గాయత్రీ మాత, మారెమ్మవ్వ

ఆస్పరి: మండల కేంద్రంలోని మారెమ్మవ్వ, రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాతకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రూపామోహన్ శర్మ, గోవిందు ఆధ్వర్యంలో అమ్మవార్లుకు కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర పూజలు జరిపించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కబడ్డీ విజేత చిట్యాల


విజేతకు బహుమతి అందిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: వాల్మీకి జయంతి సందర్భంగా మండలంలోని కోయిలకొండ గ్రామంలో నిర్వహించిన అంతర్రాష్ట్ర ఓపెన్ కబడ్డీ పోటీల్లో చిట్యాల జట్టు మొదటి స్థానంలో నిలిచినట్లు నిర్వహకులు తెలిపారు. పోటీల్లో 25 జట్లు పాల్గొనగా శుక్రవారం జరిగిన ఫైనల్ పోటీల్లో డోన్ మండలం మిద్దేపల్లి జట్టుపై చిట్యాల జట్టు గెలుపొందింది. మూడు, నాల్గవ స్థానాల్లో దేవనకొండ మండలం గుడిమరాళ్ల, డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు నిలిచిందన్నారు. గెలుపొందిన జట్లకు దాతలు వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేల నగదును అందజేశారు.

రోడ్లకు మరమ్మతులు చేయాలి


జీ.ఎర్రగుడిలో నిరసన తెలియజేస్తున్న రైతు సంఘం నాయకులు

తుగ్గలి : ఆదోని–గుత్తి ప్రధాన రహదారి గుంతలతో అధ్వానంగా మారిందని వెంటనే మరమ్మతులు చేపట్టాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ శ్రేణులతో కలిసి జీ.ఎర్రగుడిలో రోడ్డుపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రధాన రహదారి గుంతలు పడి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. అంతకు ముందు జీ.ఎర్రగుడి పార్టీ శాఖ కార్యాదర్శిగా బలరాముడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు, కొండారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సమాజ భాగస్వామ్యంతో డెంగీ నివారణ

మద్దికెర : డెంగీ, మలేరియా నివారణ సమాజ భాగస్వామ్యంతోనే సాధ్యపడుతుందని హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, సబ్‌యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణలో భాగంగా ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఇందులో భాగంగా వారానికొకసారి తొట్టెలు, నీటి డ్రమ్ములను ఖాళీ చేసి ఒక రోజు ఆరబెట్టాలని చెప్పారు. తీవ్ర జ్వరం, తలనొప్పి, కీళ్లు, కండరాల నొప్పులు ఉంటే ప్రభుత్వ వైద్యశాలలో సంప్రదించాలని సూచించారు. ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమ్మ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

విద్యాలయాల వద్ద మద్యం షాపు వద్దు


ఎక్సైజ్ ఎస్ఐ నవీన్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఆలూరు: స్థానిక ఎల్లార్తి రోడ్డు సమీపంలోనున్న బీసీ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం, డిగ్రీ, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నికల్ కళాశాలలు, బాలికల వసతి గృహాలకు సమీపంలో మద్యం షాపు ఏర్పాటు చేయడాన్ని నిలిపి వేయాలని డీవైఎఫ్ఐ,ఎస్ఎఫ్ఐ నాయకులు మైనా,గోవర్ధన్ శుక్రవారం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎక్సైజ్ ఎస్ఐ నవీన్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..విద్యాలయాలు, దేవాలయాలు, ఇళ్ల మధ్యలో మద్యం షాపుల ఏర్పాటుకు ఎలా అనుమతిస్తారని ఎక్సైజ్ ఎస్ఐ నవీన్‌కుమార్‌ను ప్రశ్నించారు. అలాగే.. డీటీ విజయ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

కృష్ణగిరి: మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు లోకేషను డీఈఓ శామ్యూల్ సస్పెండ్ చేసినట్లు తెలిసింది. బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులు రావడంతో విచారణ చేపట్టి ఆరోపణలు వాస్తవమేనని తేలటంతో శుక్రవారం సస్పెండ్ చేశారని సమాచారం.

రైతులు పంటలను కాపాడుకోవాలి


మల్లెపల్లె వద్ద ఉల్లి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు

వెల్దుర్తి(కృష్ణగిరి): అధిక వర్షాలకు పంటలు దెబ్బతినకుండా రైతులు పంటలను కాపాడుకోవాలని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సూజాతమ్మ సూచించారు. మండలంలోని మల్లెపల్లె గ్రామంలో శుక్రవారం ఆమె కంది, పత్తి, ఉద్యాన పంటలను జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏఓ శశిధర్‌రెడ్డి, మండల ఏఓ అక్బర్‌బాషాతో కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ వేరుకుళ్లు తెగులు రాకుండా కాపర్ అక్సీక్లోరైడ్ మందును 3 గ్రాములు లీటర్ నీటికి వేర్లు తడిసేలా పిచికారీ చేసుకోవాలన్నారు. పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణకు ఎకరానికి నాలుగు లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మొదటి దశ నివారణకు ప్రొఫెనోఫాస్ మందును వేపనూనెతో కలిపి పిచికారీ చేయాలన్నారు. కంది పంటలో మారుకా మచ్చల పురుగు నివారణకు నోవాల్యూరాన్ 200 ఎంఎల్ లేదా స్పైనోసాడ్ 70 ఎంఎల్ లేదా ఇండోక్సాకార్బ్ 200 ఎంఎల్ ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది అనిల్, బందెనవాజ్, వరలక్ష్మి, ప్రణీత, రైతులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ


కోయిలకొండలో సీసీ రహదారి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

తుగ్గలి : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా జొన్నగిరి, తుగ్గలి, ఉసేనాపురం గ్రామాల్లో ఉపాధి నిధులతో చేపట్టే సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు శుక్రవారం భూమిపూజ చేశారు. ఎంపీడీఓ విశ్వమోహన్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఓబులేసు, రవి, మస్తాన్‌బీ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు గురుస్వామి, వెంకటేశ్వర్లు, మిద్దె వెంకటేశ్వర్లు, వెంకటపతి, తిరుపాల్‌నాయుడు, బాలన్న, రవి, అధికారులు పాల్గొన్నారు.

చిప్పగిరి: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నేమకల్లు గ్రామంలో ఉపాధి హామీ నిధులు రూ 20 లక్షలతో వివిద అభివృద్ధి పనులకు శుక్రవారం భూమి పూజ చేశారు. సూపరింటెండెంట్ శ్రీనివాసులు,ఈఓపీఆర్డీ బాలన్న పాల్గొన్నారు.

దేవనకొండ: మండలంలోని నెల్లిబండ గ్రామంలో సీసీ రోడ్డు, గోకుల షెడ్ నిర్మాణానికి భూమిపూజ చేసినట్లు టీడీపీ సీనియర్ నాయకుడు మల్లికార్జునగౌడ్, జనసేన నాయకులు ఉచ్చీరప్ప తెలిపారు. సుంకన్న, గోవిందు, శ్రీనివాసయాదవ్, భీమేష్, సచివాలయ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణగిరి: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కటారుకొండ, పులిచెర్ల, కోయిలకొండ గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీడీఓ మోహన్‌కుమార్, పీఆర్ ఏఈ జాకీర్‌హుసేన్, ఏపీఓ నాగసులోచన, సర్పంచ్ లక్ష్మిఈశ్వరయ్య, రామాంజనేయులు, రంగడు, శేఖర్, గంగన్న పాల్గొన్నారు.

వెల్దుర్తి మండలంలో

మండలంలోని గుంటుపల్లి, శ్రీరంగాపురం, సర్పరాజపురం గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం కింద సీసీ రహదారులకు భూమి పూజ చేశారు. ఎంపీడీఓ సుహాసినమ్మ, వెంకటరాముడు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హొళగుంద: గజ్జహళ్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం భూమిపూజ చేశారు. పీఆర్ ఏఈ యమునప్ప, ఏపీఓ భక్తవత్సలం, గ్రామస్తులు రామలింగ, గిరిమల్ల, అశోక్, నాగిరెడ్డి, పంపాశేషప్ప, నబిరసూల్, శేషు, అనిల్‌స్వామి, పంచాయతీ సెక్రటరి రంగస్వామి పాల్గొన్నారు.

పంచాయతీలను క్రమ పద్ధతిలో నడపాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ


ఉప సర్పంచులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

తుగ్గలి : పంచాయతీ వ్యవస్థను క్రమపద్ధతిలో నడపాలని ఎంపీడీఓ విశ్వమోహన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టాలు, పాలనపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పంచాయతీ పరిపాలనలో కీలకపాత్ర పోషించాలని సూచించారు. పారి శుద్ధ్యం, వీధిదీపాల నిర్వహణ, తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం పనులు చురుగ్గా చేపట్టేలా చూడాలన్నారు. అనంతరం సభ్యులు అడిగిన పలు సందేహాలను నివృతి చేశారు. ఈవో పీఆర్డీ శ్రీహరి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంచాయతీలను అభివృద్ధి చేసుకోండి..

మద్దికెర : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే నిధులతో పంచాయతీలను అభివృద్ధి చేసుకోవాలని ఎంపీడీఓ కొండయ్య, ఎంపీపీ అనిత సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపసర్పంచులు, పంచాయతీ సభ్యులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ఈఓలు సుధాకర్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణగిరి: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్, వార్డు సభ్యులు భాగస్వాములు కావాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వార్డు సభ్యులు, ఉప సర్పంచ్‌లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సూపరింటెండెంట్ రామస్వామి, ట్రైనర్లు మస్తాన్‌వలి, సుంకన్న, చిన్న లక్ష్మన్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు ప్రారంభం

చిప్పగిరి: మండలంలోని ఉప సర్పంచులు, వార్డు మెంబర్‌లకు రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులు శుక్రవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రారంభమయ్యాయి. శిక్షణ పొందిన అధికారులు గ్రామాల్లో సాధారణ పరిపాలన విధానం,గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ,నీటి సరఫరా, వీధి దీపాలు, విద్యుత్ బిల్లుల నిర్వహణ, గ్రామాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ ఇచ్చారు. సూపరింటెండెంట్ శ్రీనివాసులు,ఈఓపీఆర్డీ బాలన్న,పంచాయతీ కార్యదర్శులు సురేంద్ర,సిసింద్రీ, నాయక్, నరేంద్ర, ప్రమీళ, నరసింహులు, రామాంజనేయులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములవ్వండి..

హొళగుంద: ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ విజయలత అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించి పరిస్కారానికి చొరవ చూపినప్పుడే అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల విధులు, బాధ్యతల గురించి వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

ఆస్పరి: మండలంలోని కైరుప్పల గ్రామ మాజీ సర్పంచ్, సీపీఐ సీనియర్ నాయకుడు శరవన్న (65) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఈయనకు భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సీపీఐ నాయకులు నబిరసూల్, కారన్న, రాజాసాహెబ్, నాగేంద్రయ్య, విరుపాక్షి గ్రామానికి చేరుకొని మృతదేహంపై సీపీఐ జెండా, పూలమాల ఉంచి నివాళులర్పించారు.


నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కృష్ణగిరి: మండలంలోని పందిర్లపల్లె వద్ద 220 కేవీ లైన్ ఏర్పాటు చేస్తున్నందున లక్కసాగరం సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ మద్దిలేటి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల రైతులకు త్రీఫేస్ విద్యుత్ సరఫరాను తెల్లవారుజామున 4 నుంచి ఉదయం 10 గంటల వరకు, మళ్లీ రాత్రి 9 నుంచి అర్ధరాత్రి 12 గంటలకు సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

వెల్దుర్తి మండలంలో..

మండలంలోని వెల్దుర్తి, రామళ్లకోట, కలుగోట్ల సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం మరమ్మతులు ఉండటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రాఘవేంద్ర ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నాలుగు గంటలు సరఫరా ఉండదన్నారు. ఈ సబ్‌స్టేషన్ల పరిధిలోని రైతులకు త్రీఫేస్ విద్యుత్ సరఫరాను తెల్లవారుజామున 5 నుంచి ఉదయం 9 గంటల వరకు మళ్లీ మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందని, రైతులు గమనించాలని కోరారు.

ఇంగళదహాళ్‌లో సబ్ కలెక్టర్ తనిఖీలు


హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం అమలును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

హొళగుంద: మండలంలోని ఇంగళదహాళ్ గ్రామంలో ఆదోని సబ్ కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ శుక్రవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. గతంలో జరిగిన రీ సర్వే సమస్యలపై గ్రామసభ జరిగింది. కార్యక్రమం తీరును పరిశీలించడానికి వచ్చిన ఆయన గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్, బీసీ హాస్టల్‌ను కూడా తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు సదుపాయాలు, పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు, మెనూ ఇతర విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరిన విషయాన్ని, విద్యార్థుల ఇబ్బందులను వార్డెన్ శివుడు సబ్ కలెక్టర్‌కు వివరించారు. తహసీల్దారు సతీష్, వీఆర్ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

మద్దికెర : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే ఎస్సీ, ఎస్టీ, పేద విద్యార్థులు బాగా చదివి ఉన్నతంగా ఎదిగేందుకు బండారు తిమ్మయ్య ట్రస్టు ద్వారా సహకారం అందిస్తామని ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు బీసీఆర్‌దాస్ మాదిగ అన్నారు. శుక్రవారం స్థానిక గౌరయ్య మఠంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరంలో మండలంలో పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5వేల చొప్పున అందజేస్తామని చెప్పారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత


మృతుడి భార్యకు ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

మద్దికెర : తమ మిత్రుడు పృథ్వీరాజ్ గత నెలలో గుర్రంపై నుంచి పడి మృతి చెందిన విషయం తెలుసుకున్న 2008–09 పదవ తరగతి బ్యాచ్ మిత్రులు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. ఈ మేరకు శుక్రవారం మృతుడి భార్య గాయత్రికి రూ.83 వేలు ఆర్థికసాయాన్ని అందజేసి అండగా ఉంటామని భరోసానిచ్చారు. మిత్రులు హరికృష్ణ, బాషా, నాగరాజు, మస్తాన్, షేక్షా, జాఫర్, వెంకటేష్ పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు


పుల్లగుమ్మిలో మాట్లాడుతున్న కర్నూలు ఆర్డీవో సందీప్‌కుమార్

తుగ్గలి : లింగనేనిదొడ్డిలో శుక్రవారం రీ సర్వేపై రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. భూ సమస్యలపై పది మంది రైతులు అర్జీలు అందజేశారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగరాజు, సర్వేయర్ సుధాకర్, వీఆర్వో వెంకటరాముడు పాల్గొన్నారు.

పత్తికొండ(తుగ్గలి) : మండలంలోని దేవనబండలో శుక్రవారం రీసర్వేపై రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. గ్రామసభలో భూముల రీసర్వేకు సంబంధించి రైతులు 26 అర్జీలు అందజేశారని తహసీల్దార్ రమేష్ తెలిపారు. అర్జీలపై విచారణ చేసి రైతులకు న్యాయం చేస్తామన్నారు.

హాలహర్వి: రీ-సర్వేలో సమస్యలు ఉన్న రైతులు అర్జీలు సమర్పిస్తే విచారణ చేపట్టి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నజ్మాబాను, రీ-సర్వే డీటీ బ్రహ్మయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని కుర్లేహళ్లి గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. సర్వేయర్ మంజుభార్గవ్, వీఆర్వోలు బ్రహ్మానందం పాల్గొన్నారు.

మద్దికెర : రీసర్వే చేసిన భూముల సమస్యలను పరిష్కారించడానికి గ్రామసభలు నిర్వహిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. శుక్రవారం రీసర్వే చేసిన భూముల సమస్యలపై ఎం.అగ్రహారం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): రీ సర్వేపై రైతులకు ఏమైనా అభ్యంతరాలుంటే గ్రామసభ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని కర్నూలు ఆర్డీవో సందీప్‌కుమార్ తెలిపారు. మండలంలోని పుల్లగుమ్మి గ్రామ రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రీ సర్వేలో రైతులకు సమస్యలు ఉంటే ఆధారాలతో ఫిర్యాదు చేయాలన్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ, మండల సర్వేయర్ హేమంత్ రెడ్డి, వీఆర్వో ఎల్లప్ప, గ్రామస్తులు నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కృష్ణగిరి మండలంలో

మండలంలోని టి.గోకులపాడు గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రీ సర్వేపై గ్రామ సభ నిర్వహించి రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కొలతల్లో తేడాలు తదితర వాటి కింద వచ్చిన 24 ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్వేయర్ వెంకటసుబ్బయ్య, ఆర్ఐ మనోహర్‌రావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

దేవనకొండ: అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) కర్నూలు జిల్లా 30వ మహాసభలు నవంబర్ 12, 13 తేదీల్లో ఆదోని పట్టణంలో జరగనున్నాయని, విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివిచ్చ విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు డి.సోమన్న, ఉపాధ్యక్షుడు ఎస్.శరత్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో జనరల్‌బాడీ సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ అహర్నిశలు శ్రమించిందన్నారు. ముున్ముందు కూడా సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తామన్నారు. ఎం.నరసారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం కేసు ఛేదించిన పోలీసులు


విద్యార్థితో పోలీసులు, హాస్టల్ వార్డెన్

పత్తికొండ(తుగ్గలి) : అదృశ్యమైన విద్యార్థి ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. ఈనెల 17న పత్తికొండ ప్రభుత్వ సమీకృత బాలుర వసతి గృహంలో 7వ తరగతి చదువుతున్న అనంతపురం జిల్లా గుత్తి మండలం మామిడూరు బోలే అరవింద్ ఎవరికీ చెప్పకుండా హాస్టల్ నుంచి వెళ్లి పోయాడు. దీంతో హాస్టల్ వార్డెన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. శుక్రవారం గుత్తి పట్టణంలో బాలుడి ఆచూకీని కనుగొని పత్తికొండ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి వార్డెన్‌కు అప్పగించారు. మిస్సింగ్ కేసును ఛేదించిన కానిస్టేబుల్ నిఖిల్, హోం గార్డులు బుగ్గప్ప, రామకృష్ణను అర్బన్ సీఐ జయన్న అభినందించారు.

ఉరుములు, మెరుపులతో వర్షం


ఆలూరు-మొలగవెల్లి మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవంక

ఆలూరు: అల్పపీడన ప్రభావంతో నియోజకవర్గంలో వర్షాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అరగంట పాటు కుండపోతగా కురిసిన వర్షానికి ఆలూరు మండల కేంద్రం నుంచి మొలగవెల్లి గ్రామానికి వెళ్లే దారిలోనున్న పెద్దవంక పొంగి పార్లింది. దీంతో రాకపోకలు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చిప్పగిరి నుంచి ఆలూరుకు వచ్చే రహదారిలోని కల్లివంకవాగు, అగ్రహారం, కురువెల్లి గ్రామాల్లోని చెరువుల్లోకి వరద నీరు వచ్చి చేరుతుంది. వారం నుంచి కురుస్తున్న వర్షాలకు హత్తిబెళగళ్ గ్రామ చెరువు తూము వరకు నీరు చేరింది. కురుకుంద, ముద్దనగేరి, కరిడిగుడ్డం తదితర గ్రామాల్లో పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.